ప్రజాశక్తి

గురువారం 24 జులై 2025 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

పొంగుతున్న వాగులు

మొవ్వలో నీట మునిగిన వరి పొలాలు



- వర్షాలకు పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- మొవ్వలో వరి పొలాలు మునక
- కృష్ణానదికి పెరిగిన వరద
- ఇబ్రహీంపట్నంలో లాంచీల ప్రయాణం నిలిపివేత

ప్రజాశక్తి-యంత్రాంగం

అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మైలవరంలోని కొండ వాగు ఉధృతికి సూరిబాబుపేట, బాలయోగి నగర్ వెళ్లే రహదారి పైకి వరద నీరు రావడంతో రాకపోకలు స్తంభించాయి. బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కంచికచర్ల పరిధిలోని చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగుకు వరద చేరడంతో చెవిటికల్లు వద్ద రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వైరా, కట్లేరు, మునేరుకు వరద చేరి కీసర బ్రిడ్జి వద్ద మునేరు వరద ఉధృతి పెరిగింది. గంపలగూడెం మండలం కట్టలేరు వంతెనపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెనుగంచిప్రోలు నుండి అనిగండ్లపాడుకు వెళ్లే రహదారిపై రాకపోకలు స్తంభించాయి. వర్షాలకు పంట పొలాలు నీటితో జలమయం అయ్యాయి. ఈదురు గాలులకు పత్తి చెట్లు వాలిపోయాయి. దీంతో పత్తి చెట్లు మట్టి కొట్టుకుని ఆకు ముడతలతో దర్శనమిస్తున్నాయి. మొవ్వ మండలంలో వర్షాలతో వరి పొలాలు నీట మునిగాయి. వర్షాలకు కృష్ణానది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి కృష్ణానది పరీవాహక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. లాంచీల ప్రయాణం నిలిపివేయాలని ఆదేశించారు.

... వార్తలు లోపలి పేజీల్లో

ప్రకాశం బ్యారేజీకి వరద

ప్రజాశక్తి-విజయవాడ సిటీ :ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు కీసర, మున్నేరు వాగులు పొంగి ప్రవహిస్తున్న క్రమంలో కృష్ణానదిలోకి వరద నీరు చేరుతుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి కూడా వరద నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో రానున్న రెండు, మూడు రోజులు కృష్ణానదిలో వరద ప్రవాహం గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నట్లు జల వనరుల శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రస్తుతం 20,748 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా బ్యారేజి 25 గేట్లును అడుగు మేరకు పైకి ఎత్తి 18,125 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. కాలువల ద్వారా 2,623 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



మైలవరంలోని వెల్వడం బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు వాగు, ఇన్‌సెట్‌లో గంపలగూడెం మండలం కట్టలేరు రహదారి పైనుండి ప్రవహిస్తున్న నీరు

అధికారులు అందుబాటులో ఉండాలి

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ: వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పునరావాస శిబిరాల ఏర్పాటుకు సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. తక్షణం స్పందించేందుకు వీలుగా ఇప్పటికే ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం నగరంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసేలా 9154970454 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ప్రాణ, పశు, పంట నష్టం జరగకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపై నీళ్లు నిలవకుండా, ఎక్కడైనా చెట్లు పడిపోతే వెంటనే తొలగించేలా క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.



ఇబ్రహీంపట్నం వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న తహశీల్దార్

కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకే స్మార్ట్‌మీటర్లు

... వార్త 3లో

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

... వార్త 3లో

నేడు ఆత్కూరులో గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి-ఉంగుటూరు : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం ఉంగుటూరులో పర్యటించనున్నారు. ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్టులో జరగనున్న ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం కృష్ణాజిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. గవర్నర్‌కు గ్రీన్ రూమ్ ఏర్పాటు, వేదికపైన సీటింగ్, వేదిక అలంకరణ, పిఏ సిస్టం, ఎల్‌ఈడి స్క్రీన్లు, లైవ్ కవరేజ్, ఇంటర్నెట్ తదితర అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రస్టు ఆవరణలో వైద్య శిబిరంతో పాటు అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆడిటోరియం వెలుపల విద్యార్థుల తల్లిదండ్రులు కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఎల్‌ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఫరీద్ జైద్, గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న గీతాంజలి

5లోగా హాస్టళ్లలో అడ్మిషన్లు పూర్తి

- ఎఐతో బిసి హాస్టళ్ల పర్యవేక్షణ
- అధికారులు హాస్టళ్లలో రాత్రి బస చేయాలి
- బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ద్వారా బిసి హాస్టళ్ల పర్యవేక్షణ చేపట్టనున్నామని, త్వరలోనే దీనికి సంబంధించిన యాప్ రూపొందించనున్నామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎఐ ద్వారా మెనూ అమలు, పరిశుభ్రత పర్యవేక్షణ, విద్యార్థులు, సిబ్బంది హాజరు వంటి అంశాలను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఎఐతో హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు భద్రతతో కూడిన విద్య అందించనున్నట్లు చెప్పారు. విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో బుధవారం ఆయా జిల్లాల బీసీ సంక్షేమ శాఖాధికారులు, డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీడబ్ల్యూఈవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ప్రసంగించారు. ముందుగా బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల నిర్వహణ తీరుతెన్నులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీసీ హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల ఐదో తేదీలోగా అడ్మిషన్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బిసి హాస్టళ్ల అభివృద్ధికి సిఎం అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగానే గతం ప్రభుత్వం పెట్టిన బకాయిలతో పాటు ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీడబ్ల్యూఈవోలు తరుచూ హాస్టళ్లను సందర్శించాలని, వీలైతే రాత్రి బస కూడా చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి టూర్ డైరీ రూపొందించాలని, ఆ డైరీని ప్రతి నెలా అయిదో తేదీలోగా రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని తెలిపారు. హెచ్‌డబ్ల్యూఎస్‌లు రాత్రి సమయాల్లో హాస్టళ్లలో తప్పనిసరిగా బస చేయాల్సిందేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టామని మంత్రి సవిత వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.13 కోట్లు వెచ్చించిందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో పలు హాస్టళ్లలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు ఆగస్టు 30వ తేదీ నాటికి పూర్తి చేయాలన్ని స్పష్టం చేశారు. హాస్టళ్లలో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి తమ వంతు సాయంగా ముందుకొచ్చే దాతలను గుర్తించాలని సూచించారు. కుల వృత్తిదారులకు ఆదరణ 3.0 పథకం ద్వారా ఆధునిక పరికరాలను ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, 26 జిల్లాలకు చెందిన డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీడబ్ల్యూఈవోలు, ఎంజేపీ స్కూళ్ల కన్వీనర్లు, బీసీ కార్పొరేషన్ ఈడీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత

మూడు షిప్టుల్లో విధులు నిర్వహించాలి : ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ: ఎమినిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలతో ఏర్పాటుచేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీం మూడు షిఫ్ట్ లలో విధులు



నిర్వహించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, రథం సెంటర్, బందర్ రోడ్, బెంజ్ సర్కిల్, బెంజ్ సర్కిల్ నుండి రామవరప్పాడు నేషనల్ హైవే సర్వీస్ రోడ్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాన్సూన్ రెస్పాన్స్ టీం తమ తమ పాయింట్లలో ఉదయం 6 గంటలకు మొదలై మూడు షిఫ్ట్ లలో విధులు నిర్వహించాలని, వర్షం వచ్చినా రాకపోయినా ఖచ్చితంగా మాన్సూన్ రెస్పాన్స్ టీం తమ తమ పాయింట్లు విధులు నిర్వహించాలని, వర్షం వచ్చిన వెంటనే పది నిమిషాలలో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి టీం తమ వద్ద నీటి నిల్వలు తీసేందుకు అవసరమైన పరికరాలు ముందుగానే సమకూర్చుకోవాలని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, అధికారులను ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, చీఫ్ సిటీ ప్లానర్ ముగ్గురు సమన్వయంతో మాన్సూన్ రెస్పాన్స్ టీం సమర్థవంతంగా పనిచేయాలని, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి నోడల్ ఆఫీసర్గా వ్యవహరించాలని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: విఎంసి ప్రధాన కార్యాలయంలో రివర్స్ ఆస్మోస్ అల్ట్రా వైలెట్ ఆటో వాటర్ ప్లాంట్‌ను బుధవారం సాయంత్రం టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, చీఫ్



ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ రివర్స్ ఓస్మోసిస్ అల్ట్రా వైలెట్ ఆటో వాటర్ ప్లాంట్ 5 లక్షల వ్యయంతో 1000 ఎల్‌పిహెచ్ (లీటర్ ఫర్ అవర్) సామర్థ్యం గలదని, ప్రత్యేకించి వర్షాలు కాలం లో ఎటువంటి బ్యాక్టీరియా రాకుండా అల్ట్రా వాయిలెట్ కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దారా రాంబాబు, సెక్రటరీ సింహాచలం, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సుబ్రహ్మణ్యం, పి. సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సురేఖ, శ్రీనివాస్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ బుద్ద రాజా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పి4లో మహిళా పారిశ్రామికవేత్తలు భాగస్వామ్యం కావాలి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ



ప్రజాశక్తి-విజయవాడ

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేదలకు ఆసరాను అందించి, జీవితంలో స్థిరపడేలా ఫిక్కీ మహిళాపారిశ్రామికవేత్తలు మార్గదర్శకులుగా నిలవాలని.. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో అమలుచేస్తున్న పీ4 విధానంలో భాగస్వాములుగా ముందుకురావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌వో)- విజయవాడ ప్రతినిధులతో బుధవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో పీ4 విధానం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి, 2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించాలనే లక్ష్యంతో పీ4 విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పేదలు పూర్తిస్థాయిలో పేదరికం నుంచి బయటపడలేకపోతున్నారనే విషయాన్ని గుర్తించి, పీ4 విధానంలో మార్గదర్శులు ద్వారా నిరుపేదలైన బంగారు కుటుంబాలను ఎంపిక చేసుకొని వారిని దత్తత తీసుకోవడం ద్వారా ఆయా కుటుంబాలు వారు ఆర్థికంగా, కుటుంబ పరంగా ఆశించిన స్థాయిలో ఆర్థిక, ఆరోగ్య పరిపుష్టిని సాధించేవరకు చేయూతనివ్వడం ముఖ్య ఉద్దేశమన్నారు. పీ4 విధానం ద్వారా బంగారు కుటుంబాన్ని ఎంపిక చేసుకొని ఆ కుటుంబంవారు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించి విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్యాభివద్ధి వంటి అంశాల్లో ఆసరా ఇచ్చేందుకు ఆర్థిక పరిపుష్టి సాధించిన వారు మార్గదర్శులుగా ముందుకురావాలని సూచించారు. జిల్లాలో 86 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, ఇప్పటికే దాదాపు 3,700 మంది మార్గదర్శులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఎఫ్‌ఎల్‌వో మహిళా పారిశ్రామికవేత్తలు.. సామాజిక దక్పథంతో నిరుపేదలను ఆదుకోవడం ద్వారా రాష్ట్రాభివద్ధిలో తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం ఆశించిన ఫలితాల సాధనకు పీ4 విధానంలో భాగస్వాములై బంగారు కుటుంబాలకు ఆసరా అందించాలని కలెక్టర్ లక్ష్మీశ మహిళా పారిశ్రామికవేత్తల దష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎఫ్‌ఎల్‌వో - విజయవాడ సీనియర్ వైస్ ఛైర్‌పర్సన్ సుప్రియా మాలినేని, సెక్రటరీ సుమబిందు అట్లూరి, ట్రెజరర్ తుల్జాభవానీ దేవినేని, జాయింట్ సెక్రటరీ దీప్తి చలసాని, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య పాల్గొన్నారు.



జన సురక్ష పథకాలతో భద్రత

లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక

ప్రజాశక్తి-విజయవాడ: జన సురక్ష పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భద్రత కల్పించడం జరుగుతోందని.. ఈ పథకాలపై అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) కె.ప్రియాంక అన్నారు.జన సురక్ష పథకాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎనికేపాడులో జిల్లా లీడ్ బ్యాంక్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) బ్రాంచ్‌లో జన సురక్ష శిబిరాన్ని కె.ప్రియాంక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అర్హులందరూ నమోదు చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.ఐదు వేల వరకు కనీస పెన్షన్ లభిస్తుందన్నారు. చందాదారుడు మరణించినప్పుడు జీవిత భాగస్వామికి అదే పెన్షన్ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ మేనేజర్ సీహెచ్ నవీన్ కుమార్, ఎనికేపాడు బ్రాంచ్ మేనేజర్ వినోద్ పాల్గొన్నారు.

నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో

పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ :

విజయవాడ రైల్వే డివిజన్లో మరమ్మతు పనుల రీత్యా జూలై, ఆగస్టుల్లో 100కు పైగా రైళ్ల రద్దు, దారి మళ్లింపు జరిగాయి. డివిజన్ పరిధిలో ప్రస్తుతం నాన్-ఇంటర్ లాకింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈనేపథ్యంలో పెద్ద సంఖ్యలో రైళ్ల రాకపోకల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పులు బుధవారం నుండి అమలులోకి వచ్చాయి. ఇవి ఆగస్టు 24వ తేదీ వరకూ కొనసాగుతాయి. ఈకాలంలో మొత్తం 53 రైళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా రద్దవుతాయి. అదనంగా 50 రైళ్లను ఇతర మార్గాల ద్వారా మళ్లించగా, మరికొన్ని రైళ్ల సమయాల్లో మార్పు చేశారు. కొన్ని రైళ్లను రీషెడ్యూల్ చేశారు. జూలై 23 నుంచి 29 వరకు, ఆగస్టు 6 నుంచి 24 వరకు రద్దయిన రైళ్ల వివరాలిలా ఉన్నాయి. **విజయవాడ నుంచి :** ఒంగోలు, తెనాలి, బిట్రగుంట, గుంటూరు, రేపల్లె-తెనాలి, గూడూరు, రేపల్లె-మార్కాపురం రోడ్డు.

ఇతర ప్రధాన మార్గాల్లో : సికింద్రాబాద్-గూడూరు, తిరుపతి లింగంపల్లి, లింగంపల్లి-తిరుపతి, నరసాపురం-ధర్మవరం, రేణిగుంట-కాకినాడ, విశాఖపట్నం-తిరుపతి, జల్నా-తిరుపతి, చర్లపల్లి-తిరుపతి, యశ్వంత్‌పూర్-తుగ్లకాబాద్, రోయాపురం-పటేల్ నగర్.

పాక్షికంగా రద్దైన రైళ్లు, తాత్కాలిక మార్పులు: ఈ రైళ్లు కొంత దూరం వరకు మాత్రమే సేవలందిస్తాయి. మిగిలిన దూరంలో రద్దు చేశారు. వీటి వివరాలు కాచిగూడ-రేపల్లె, చర్లపల్లి-రేపల్లె, రేపల్లె-సికింద్రాబాద్, రేపల్లె-వికారాబాద్. ఈనెల 22 నుండి 29 వరకు దారి మళ్లించిన దూర ప్రాంతాల రైళ్లు... షాలిమార్-చెన్నై, హౌరా-బెంగళూరు, నిజాముద్దీన్-ఎర్నాకుళం, జోధ్‌పూర్-చెన్నై, అయోధ్య-రామేశ్వరం, ఖరగ్‌పూర్-విల్లుపురం, సంత్రగచ్చి-మంగళూరు, పురూలియా-తిరునల్వేలి, గయా-చెన్నై, అగర్తల-బెంగళూరు, హౌరా-తిరుపతి, మధురై-చండీగఢ్, తిరుపతి-భువనేశ్వర్, ధన్‌బాద్-అలప్పుజా, గోరఖ్‌పూర్-కొచ్చువేలీ. సమయాల్లో మార్పు (రీషెడ్యూల్ రైల్వే శాఖ ప్రకారం) : 15 రైళ్ల సమయాల్లో మార్పు చేశారు. నాలుగు రైళ్లను రీషెడ్యూల్ చేశారు. మరింత సమాచారం కోసం https://www.indianrail.gov.in లేదా NTES యాప్‌ను ఉపయోగించుకోవచ్చు.

విపత్తు నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మీటింగ్ హాల్లో విపత్తు నిర్వహణపై అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విపత్తు ఎన్ని విధాలుగా రావచ్చు, విపత్తు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి, విపత్తు సమయం లో ఎటువంటి చర్యలు తీసుకోవాలి, విపత్తు ఎదురుకున్న తరవాత ఎటువంటి చర్యలు తీసుకోవాలి వంటి అంశాలు చర్చించారు. ఇతర రాష్ట్రలలో, దేశాలలో విపత్తు నిర్వాహణ ఎలా జరుగుతుంది, ఆ పద్ధతులు ఏ విధంగా మనకు అమలు చేయొచ్చు వంటి విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ గత సంవత్సరం తీవ్రమైన విపత్తును ఎదుర్కొందని, విపత్తు ఎప్పుడొస్తుంది ఎలాంటి పరిస్థితుల వల్ల వస్తుంది అన్న అంశాలు చెప్పలేమని, కానీ విపత్తు ఎలా వచ్చినా విజయవాడ



నగరపాలక సంస్థ పరిధి లో విపత్తు సమయంలో పునరావస కేంద్రాలు ఎక్కడున్నాయి, ఎవరిని సంప్రదించాలి వారికి సహాయానికి వచ్చే బందాల నంబర్లు, అన్ని విషయాలు విపత్తు సంభవించే ప్రాంతాలకు తెలిపరిచినట్లు తెలిపారు. తద్వారా ప్రజలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే వారిని వారు కాపాడుకునే చర్యలు కచ్చితంగా తీసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎ.ఉమామహేశ్వరరావు, రోడ్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ ఇంచార్జ్ ఆర్. ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ బిజిఎల్ స్రవంతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీసిపిడిసిఎల్ రామకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ ధనుంజయ్‌రావు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకే స్మార్ట్‌మీటర్లు

- వ్యతిరేకించాలని ప్రజాసంఘాల నాయకుల పిలుపు



ఉంగుటూరులో మాట్లాడుతున్న లక్ష్మణస్వామి

ప్రజాశక్తి-ఉంగుటూరు : స్మార్ట్ మీటర్లు పెట్టడం వెనుక విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగి ఉందని దీనిని అర్థం చేసుకుని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజా వేదిక నాయకులు టీవీ లక్ష్మణ స్వామి అన్నారు. మండల కేంద్రంలోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో బుధవారం రైతు సంఘం మండల కార్యదర్శి మాగంటి సాంబశివరావు అధ్యక్షతన 'స్మార్ట్ మీటర్లు వద్దు – ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు' అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మణ స్వామి మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదానికి అప్పగించాలనే ఉద్దేశంతో ఈ స్మార్ట్ మీటర్లను ఆదానీ కంపెనీకి అప్పగించాయని అన్నారు. స్మార్ట్ మీటరు బిగిస్తే దాని ఖరీదు 18 వేల రూపాయలు మనం చెల్లించే బిల్లులో తిరిగి చెల్లించాలని, అలాగే ఏదైనా సమస్య వస్తే అడిగితే సమాధానం చెప్పడానికి కూడా ఎవరూ ఉండరని, విద్యుత్ వ్యవస్థ రద్దు అవుతుందని అన్నారు. ఇంతటి ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించే విధంగా చైతన్య పరచాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మాజీ సర్పంచ్ గుండె రవికుమార్, వెన్నూతల సర్పంచ్ టివి రామ్మోహ న్రావు, సిఐటియు నాయకులు రామ రాజు, కౌలు రైతు సంఘం నాయకులు మహమ్మద్ గాలిబ్ ,వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : ప్రజలకు హాని చేసే విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని కోరుతూ బుధవారం గన్నవరం రామ్ నగర్ లో ప్రజా వేదిక నాయ కులు ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు పెడితే అదాని మీ ఇంట్లో ఉన్నట్లే అని చెప్పారు. కరెంటు బిల్లులు ఇప్పటికే పెరిగిపోయాయని, స్మార్ట్ మీటర్లతో భరించలేని విధంగా బిల్లులు వస్తాయని ప్రచారం చేశారు. కార్పొరేట్ వ్యక్తులకు ఆర్థికంగా దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఈ స్మార్ట్ మీటర్ల విధానం తెచ్చిందన్నారు. ప్రజలంతా ప్రారంభంలోనే వీటిని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా వేదిక నాయకులు కే.వెంకటేశ్వ రరావు, మల్లంపల్లి ఆంజనే యులు, కాట్రగడ్డ జోషి, విజయరావు, గుండి మెడ ఉదయ భాస్కరరావు, సురగాని సాంబశివరావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, మిరప నాగేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ఒకపక్కన బాదుడు స్మార్ట్ మీటర్ల బిగింపుతో సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు మోపి ప్రజా వ్యతిరేక విధానాలను నేటి ప్రభుత్వం అవలంబిస్తుందని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె శివ నాగేంద్రం అన్నారు. బుధవారం స్మార్ట్ విద్యుత్ మీటర్ల ను వ్యతిరేకించాలి అనే అంశంపై శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆగస్టు 5న విద్యుత్ ట్రూ అప్ చార్జీలు బాదుడుకు వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డగించాలని తమ నిరసన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు బి రాజేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ సహాయ కార్యదర్శి బి కీర్తి, సీనియర్ నాయకులు తుమ్మల చంద్రమౌళి, కెవిపిఎస్ నాయకులు నెమ్మది గోపాల్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలపాల రవి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కస్తూరి సత్యవతి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** విద్యుత్ భారాలపై ప్రజా సంఘాల ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం కోడూరులోని మార్క్సిస్ట్ భవనంలో బుధవారం జరిగింది. స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని, ట్రూ ఆఫ్ చార్జీలు, సర్దుబాటు ఇందనపు ఛార్జీలు రద్దు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తీర్మానించారు. ఈనెల 23 నుండి ఆగస్టు 4 వరకు గ్రామ గ్రామాన ప్రచారాలు, సంతకాల సేకరణ నిర్వహించాలన్నారు. రైతు సంఘం నాయకులు ఆవల బసవయ్య, సిఐటియు నాయకులు విక్టోరియా, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణరావు, రైతు కూలీ సంఘం నాయకులు నాగేంద్రం పాల్గొన్నారు.


గన్నవరంలో...


ఉయ్యూరులో...



చోరీ కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో వేరు వేరు దొంగాతనాలకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసి వారి నుండి సుమారు 10,20,000 లక్షల రూపాయలను సుమారు 100 గ్రాముల విలువైన బంగారపు వస్తువులు , సుమారు 700 గ్రాముల విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు మచిలీపట్నం డిఎస్పి సిహెచ్ రాజా తెలిపారు. బుధవారం మచిలీపట్నం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కేసు పూర్వపరాలను వివరించారు. ఈనెల ఆరో తేదీన మచిలీపట్నంలో మహంకాళి గురుతేజశర్మతో పాటు వారి పక్కన గదిలో అద్దెకువుంటున్న మోపిదేవి వెంకట సత్య శ్రీనివాసు అనే వారి ఇళ్లలో జరిగిన చోరీలో బందరుకు చెందిన కొక్కిలిగడ్డ రాము, వల్లూరు సంతోష్‌తోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో పాల్గొన్న మచిలీపట్నం ఎస్సై బి ప్రభాకర్ రావు,కానిస్టేబుళ్లను అభినందించారు.

డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసును సిబిఐకి అప్పగించాలి : వైసిపి


బడే గౌతం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో 2020లో జరిగిన డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసును సిబిఐ కి అప్పగించాలని వైసీపీ యువనేత బడే గౌతం డిమాండ్ చేశారు. బుధవారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హత్య జరిగి ఐదేళ్లవుతున్నా ఆ కేసును ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రాజకీయంగా వాడుకుంటున్నారు తప్ప నిజాలను నిగ్గు తేల్చే ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. అప్పట్లో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా బుద్ధ ప్రసాద్ ఆ కేసు పట్ల వైసిపి ప్రభుత్వంపై ఎన్నో ఆరోపణలు చేశారని, 2024 ఎన్నికల ప్రచారంలో అవనిగడ్డ కు వచ్చిన పవన్ కళ్యాణ్ దృష్టికి హత్య కేసు తీసుకువెళ్లగా ఆయన న్యాయం చేస్తానని హామీ ఇచ్చి నిందితులకు శిక్ష పడేలా చేస్తామంటూ వాగ్దానం కూడా చేశారన్నారు. కానీ ఈరోజు వరకు ఏ న్యాయం జరగలేదని, ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీని పూర్తిగా మర్చిపోయారని ఆయన మాటకు విలువ లేకుండా పోయిందన్నారు.

హారిక దంపతులకు బైరెడ్డి పరామర్శ



ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : ఉమ్మడి కృష్ణా జడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులను బుధవారం వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. గుడివాడలో ఇటీవల ఉప్పాల హారిక రాము దంపతులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఉప్పాల హారిక నివాసానికి చేరుకుని దాడి ఘటనలో ఎదుర్కొన్న ఇబ్బందులు, కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై చర్చించారు. బైరెడ్డి శ్రీధర్ రెడ్డి రాకతో వైసిపి కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి పేర్ని కష్ణమూర్తి ఇలియాస్ కిట్టు బైరెడ్డి వెంట ఉన్నారు.

మురళీకృష్ణకు మాజీ ఎంఎల్ఎ పరామర్శ



మురళీకృష్ణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డివై దాస్

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల కుమార్తెను కోల్పోయిన గాజుల మురళీకృష్ణను పామర్రు మాజీ ఎమ్మెల్యే డి వై దాస్ పరామర్శించారు. మురళీకృష్ణ కుమార్తె గాజుల లాస్య ఈనెల 19న మృతిచెందింది. బుధవారం మురళీకృష్ణ స్వగ్రామమైన అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామంలో ఆయన స్వగృహానికి వెళ్లి దాస్ పరామర్శించారు. లాస్య అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతలపాటి సుబ్బారావు, మద్దాల రాజబాబు, దోవారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన


శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండే మచిలీపట్నం డీమార్ట్ ప్రాంగణంలో మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ పై బుధవారం మచిలీపట్నం మహిళ పోలీస్ స్టేషన్ పోలీసులు అవగాహన కల్పించారు. డీమార్ట్ మహిళా వినియోగదారులకు, సిబ్బందికి శక్తి యాప్ డౌన్లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ప్రతి మహిళ శక్తి యాప్ ను కలిగి ఉండాలని పోలీసులు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ముఖ్యంగా మహిళలతో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేయించి దాని ఉపయోగాన్ని తెలిపారు. ఆపద సమయంలో మహిళలు శక్తి యాప్ ను ఉపయోగించి రక్షణ పొందవచ్చు అని తెలిపారు. అత్యవసర సమయంలో శక్తి యాప్ ను మహిళలు ఉపయోగించుకోవాలని పోలీసులు కోరారు.

స్వచ్ఛసర్వేక్షణ్ బృందం పర్యటన

ప్రజాశక్తి ఘంటసాల : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ – 2025 సర్వేలో భాగంగా ఘంటసాల మండలం ఘంటసాలపాలెం, శ్రీకాకుళం గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ సర్వేను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా సర్వే ప్రతి నిధులు మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్, పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణ నీటి పారుదల, పారిశుధ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బందంతో కలిసి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కేంద్ర బృందం ప్రతినిధులు జె.శివ ఘంటసాల పాలెంలో, జి.శ్రీనివాస్ శ్రీకాకుళంలో స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ జిల్లా సభ్యులు కె.పవన్ కుమార్‌లు ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, రోడ్లు, డ్రైయినేజీలను పరిశీలించి వాటి నిర్వహణ, సౌకర్యాలు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను సర్వే చేయడంతో పాటు ఒక్కో గ్రామంలో 16 మంది చొప్పున రెండు గ్రామాల్లో ఎంపిక చేసిన కుటుంబాలను సందర్శించి వారి వివరాలు, జీవనోపాధి, మరుగుదొడ్ల నిర్వహణ, తడి పొడి చెత్త నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, మురుగు నీరు నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సర్వే యాప్ లో ఆన్ లైన్ ద్వారా నమోదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఘంటసాలపాలెం, శ్రీకాకుళం సర్పంచులు దోనె రజినీ, ముప్పనేని రవి ప్రసాద్, ఎంపిడివో డి.సుబ్బారావు, డిప్యూటీ ఎంపిడివో కె. వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ బృందం బుధవారం చల్లపల్లిలో పర్యటించారు. చల్లపల్లిలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. సంపద కేంద్రాలని పరిశీలించి వర్మీ కంపోస్టు తయారీని చూశారు. గ్రామంలో పలు మరుగుదొడ్లను పరిశీలించి వాడుతున్నారా లేదా అని వివరాలు తెలుసుకున్నారు. సర్వే లీడర్ టీం సభ్యులు సి.రవివర్మ ,స్వచ్ఛ స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ అంకం ఏసోబు, ఎంపీడీవో ఏ.వి. రమణ ఈఓఆర్డి రవిశంకర్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి. మాధవేంద్రరావు పాల్గొన్నారు


ఘంటసాలలో...


చల్లపల్లిలో...

వరి నాట్లు వేసిన ఆర్‌డిఓ మాధురి



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు డెవెన్యూ డివిజన్ అధికారిణి (ఆర్డీ ఓ) కె.మాధురి రైతుగా, కూలీగా మారి అందరినీ ఆశ్చర్య పరిచారు. ఇంతవరకు పొలాలు చూడ టానికి వచ్చిన అధికారులు కాళ్లకు బురద అంటని ప్రదేశంలో నిలబడి పంట వివరాలను రైతులను అడిగేవారు. కానీ ఆర్డీఓ మాధురి బుధవారం నేరుగా దమ్ము చేసిన పొలంలో దిగి రైతులతో, కూలీలతో మాట్లాడి సాధకబాధలను అడిగి తెలుకుని నాట్లు వేశారు. తిరువూరు మండలంలోని రోలుపడి గ్రామంలో వ్యవసాయ అధికారులు చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆర్డీఓ పాల్గొన్నారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆర్డీఓ ఉద్యానవన పంటలు, సేంద్రియ ఎరువులు వాడకం వాటి ఆవశ్యకతను, ప్రభుత్వం అందించే వ్యవసాయ పరికరాలు, పలు యంత్రాలను రైతులకు వివరించారు. అనంతరం మండల పరిషత్ పాఠశాల విద్యార్ధులతో కలిసి ఆమె వరి నాట్లు ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. రైతుల కష్ట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ భాస్కర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.రవి బాబు, మండల వ్యవసాయ అధికారి పి.పద్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే ఫుడ్ కోర్టుకు అనుమతులు : కూటమి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరిపై వైసీపీ నేత పోతిన మహేష్ చేసిన వ్యాఖ్యలను నియోజకవర్గ కూటమి కార్పొరేటర్లు తీవ్రంగా ఖండించారు. సితార సెంటర్‌లో ఫుడ్ కోర్ట్ ఏర్పాటుపై పోతిన మహేష్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భవానీపురం లోని ఎన్డీఏ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ వాస్తవానికి ఫుడ్ కోర్ట్‌కు రెండేళ్ల క్రితమే అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. ఫుడ్ కోర్టుకు అనుమతులు వచ్చిన సమయంలో అధికారంలో ఉన్నది వైసీపీ ప్రభుత్వమేనన్న సంగతి పోతిన మహేష్ మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, మైలవరపు మాధురి లావణ్య , మరుపిళ్ళ రాజేష్, అత్తలూరి ఆదిలక్ష్మి పెద్దబాబు, మైలవరపు రత్నకుమారి దుర్గారావు, మహాదేవు అప్పాజీరావు, టీడీపీ సీనియర్ నేత మైలవరపు కృష్ణ పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ అవకాశాలపై ప్రత్యేక సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ వన్‌టౌన్లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో, హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీలో సేల్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నవధీర్ చిట్టా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్లేస్మెంట్ అవకాశాలు, పరిశ్రమలో అవసరమైన నైపుణ్యాలు అనే అంశంపై ఎం.బి.ఏ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. నేటి ఉద్యోగ విపణిలో, నియామకాలను పొందడంలో సాంకేతిక, బృదువైన నైపుణ్యాల సమ్మేళనం చాలా ముఖ్యమైందన్నారు. కీలకమైన సాంకేతిక నైపుణ్యాలలో డిజిటల్ అక్షరాస్యత, డేటా విశ్లేషణ, పరిశ్రమ- నిర్దిష్ట సాఫ్ట్‌వేర్‌లో నైపుణ్యం ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్, యం.బి.ఏ విభాగాధిపతి శ్రీనివాస్ మూర్తి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఏం చేశారని సుపరిపాలన : వెలంపల్లి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్కు సుపరిపాలన కార్యక్రమం నిర్వహించే నైతిక హక్కు ఎక్కడుందంటూ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ రావు ప్రశ్నించారు. భవానీపురం గాంధీ బొమ్మ రోడ్‌లోని 40వ డివిజన్ వైసిపి కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 40వ డివిజన్ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ కేసరి కష్ణారెడ్డి, కార్పొరేటర్లు షేక్ ఇరాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, 40వ డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కరకట్ట ప్రాంత ఇళ్లకు రిజిస్ట్రేషన్ పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ, తూర్పు సిటీ, 16వ డివిజన్, భూపేష్ గుప్తా నగర్‌లో కృష్ణా కరకట్ట ఇళ్ళ పట్టాల సాధన కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ కృష్ణా కరకట్ట పరిసర ప్రాంతాల్లో 50 సంవత్సరాలుగా స్థిరమైన నివాసం ఏర్పరచుకొని వేల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. 40 సంవత్సరాలలో అనేక పర్యాయాలు ఈ ప్రాంతంలోనే మన ఇళ్ళు వరద ముంపునకు గురై తీవ్ర ఆస్తి నష్టాలు సంభవించాయన్నారు. సిపిఎం ఈ ప్రాంత ప్రజలను ఐక్యం చేసి కృష్ణానదిపై రక్షణ గోడ రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని ప్రజా పోరాటాలను నిర్వహించిందన్నారు. ప్రభుత్వాలు ఇల్లు తొలగించే ప్రయత్నం చేసిన ప్రతిసారి పిఎం, ప్రజలు ఐక్యంగా ఎదుర్కొని ఈ ప్రాంతాన్ని కాపాడుకున్నారన్నారు. జీవో 30ని అమలు చేసి రిజిస్ట్రేషన్‌తో



కూడిన ఇళ్ల పట్టాలు ఈ ప్రాంత వాసులకు ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయం వద్ద ఇళ్ల పట్టాలు ఇవ్వాలని దరఖాస్తుదారులను కలుపుకొని ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కమిటీ సభ్యులు యన్.నాగేశ్వరరావు, స్థానిక నాయకులు జి.కె.ప్రసాద్, గణేష్ తదితర స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో బుధవారం విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆళ్ళ అమ్మిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై సర్దుబాటు ఛార్జీలు పేరుతో రూ.67 వేల కోట్లు ప్రజలపై భారాన్ని మోపిందని, అదాని తయారుచేసిన స్మార్ట్ మీటర్లను ఇళ్ళకు షాపులకు బిగించి ఒక్కొక్క మీటర్ కు 13 వేల రూపాయలను ప్రజలపై నెలవారి వసూళ్లు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని దీన్ని ప్రజలందరూ వ్యతిరేకించి స్మార్ట్ మీటర్లను రద్దుచేసి విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంబి వెంకటేశ్వరరావు, టి.లక్ష్మయ్య,వీరంకి వెంకటేశ్వరరావు, అరికెపూడి శ్రీనివాసరావు, గవ్వల పల్లి వెంకటేశ్వరరావు, మరీదు తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణదారులకు హెచ్చరికలు

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట స్థానిక ఎరువుల దుకాణంలో బుధవారం ఎడిఎ శశికళ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల నకలు కాపీ తీసుకొని వచ్చి ఎరువులు కొనాలని ఎరువుల దుకాణం దారులు అధికంగా అర్హత లేని రైతులకు ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. యూరియా కృత్రిమ కొరత పేరుతో గ్రామాలలో లైసెన్సు లేనివారు విక్రయిస్తే పోలీస్ కేసు నమోదు తప్పదన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయించిన వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి కష్ణా నది పరీవాహక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. అదేవిధంగా లాంచీ ప్రయాణం నిలిపివేయాలని ఆదేశించారు. కృష్ణానది సమీపంలోని ఇళ్లల్లో ప్రజలు, లంక ప్రాంత ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు అందించాలని ఆదేశించారు. తహశీల్దార్ వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మనోజ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

యాజమాన్యాల మార్పుతో విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల వ్యాప్తంగా గత మూడు ఏళ్ల నుండి మండలంలోని కొన్ని విద్యాసంస్థల్లో యాజమాన్యాలు మారుతున్నాయి. స్థానికులతో మంచి జరుగుతుందన్న ఉద్దేశంతో విద్యార్థులను స్థానికంగా ఏర్పాటైన విద్యాసంస్థల్లో తల్లిదండ్రులు చేర్పించారు. పాత యాజమాన్యాలు కాస్త వ్యాపారంగా మార్చుకొని, ఏకంగా విద్యాసంస్థలను (విద్యార్థులతో సహా) వేరే యాజమాన్యాలకు తాకట్టు పెట్టుకున్న పరిస్థితులు మండలంలో చోటుచేసుకుంది. తద్వారా కొత్త యాజమాన్యాలు పాత బోర్డులను మరుగున పెట్టి కొత్త బోర్డులు ఏర్పాటు చేశారు. ఇందులో జీవీ అకాడమీ, శ్రీనిధితో పాటు మరో విద్యాసంస్థ బోర్డ్ లేకుండా కొనసాగిస్తున్నాయి. రిజిస్టర్లో ఒకటి బయటికి ఒకటి చూపిస్తూ, విద్యా వ్యాపారం చేసుకుంటున్నారు. రాను, రాను కొత్త యాజమాన్యాలు విద్యార్థుల పట్ల నిరంకుశ పరిస్థితులను అమలు చేయడంతో అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు చిక్కుకుపోయి విలవిలలాడుతున్నారు. స్థానికంగా ఉన్న విశిష్ట జూనియర్ కళాశాల ఇతరులకు పాత యాజమాన్యం బదలాయిస్తే కొత్త యాజమాన్యం కాస్త వ్యాపారాన్ని మరింత కార్పొరేట్ దిశగా మార్చుకున్న విషయం పూర్తిగా వెల్లడయింది. ఆ కళాశాలలో ఇంటర్, డిగ్రీ కోర్సులు కొనసాగుతుండగా, ఇంటర్ రెండు సంవత్సరాల్లో 150 మంది, డిగ్రీ విద్యలో మరో 150 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వనందున సదరు సిబ్బంది పెన్డౌన్ అనే పేరుతో మంగళవారం ఒక్కరోజు మొరాయించారు. జీవి అకాడమీ అనే వలస యాజమాన్యం దిగివచ్చి ఏకంగా ఆ సిబ్బందికి వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. చేసేదిలేక ఆ ఉపాధ్యాయులు తమ జీతాలు ఇవ్వాలని పట్టు పట్టినట్లు



సమాచారం. ఈ విషయమై యాజమాన్యం చెక్కుల రూపంలో నగదును అందజేసినట్లు సమాచారం.

రోడ్లపైనే విద్యార్థులు : ఈ పరిస్థితుల్లో పాఠాలు చెప్పేవారు లేక రోడ్ల వెంట తిరిగాడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. యాజమాన్యం మచ్చుకు ఇద్దరు వలస ఉపాధ్యాయులను రప్పించి, విద్యార్థులకు (వార్నింగ్ రూపంలో) కౌన్సిలింగ్ ఇచ్చినట్లు విద్యార్థులే చెబుతున్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు ఆరా తీసి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పొంగుతున్న వాగులు




ప్రజాశక్తి - కంచికచర్ల : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలో చెవిటికల్లు వద్ద గల లక్ష్మయ్య వాగు వరద చేరింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుండి పలు దఫాలుగా వర్షం కురిసింది. మంగళవారం రాత్రి తెరపివ్వకుండా వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి 68.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.దీంతో ఎగువ ప్రాంతాల్లో చిన్న వాగులు, పొలాల్లో నుండి వరద లక్ష్మయ్య వాగుకు చేరింది. ఈ వాగు వరద బుధవారం ఉదయం చెవిటికల్లు వద్ద రోడ్డు పై ప్రవహించింది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతి యేటా జులై నెల నుంచి సెప్టెంబర్ వరకు ఏ చిన్నపాటి వర్షం వచ్చినా లక్ష్మయ్య వాగుకు వరద ఛేరి రాకపోకలు నిలిచిపోయాయి. చెవిటికల్లు వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వైరా, కట్లేరు, మునేరుకు వరద చేరి కీసర బ్రిడ్జి వద్ద మునేరు వరద ఉధృతి పెరిగింది. భారీ వర్షాలకు కంచికచర్ల మండలంలో పలు గ్రామాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. అంతర్గత రహదారులు బురదగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

మైలవరం : అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మైలవరం నియోజక వర్గంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మైలవరం లోని కొండ వాగు ఉధృతికి సూరిబాబు పేట, బాలయోగి నగర్ వెళ్లే రహదారి పైకి వరద నీరు రావడంతో రాకపోకలు స్తంభించాయి. బుడమేరు కూడా ఉధతంగా ప్రవహిస్తుంది. వాగులు ఉదతంగా ప్రవహించటంతోపలు చెరువులు నిండాయి.లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కురుస్తున్న వర్షాలకురైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మైలవరంలో 48.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు అయినట్లు అసిస్టెంట్ శాటిస్టికల్ అధికారి దయానంద్ తెలిపారు.



పొంగుతున్న కొండవాగు

రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని పాత నాగులూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో బత్తుల నరసయ్య ఇంటి దగ్గర నుండి పత్తిపాటి అనుపమ ఇంటి వరకు గల రోడ్డు వానొస్తే వరదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఎస్సీ కాలనీలోని ఈ రోడ్డుకి ఇరువైపులా ఎస్సీ కులస్తులు నివాసముంటున్నారు. చిన్నపాటి వర్షానికే ఈ రోడ్డు వరదమయంగా మారి నీరు నిల్వ ఉంటుంది. దీంతో ఇక్కడ దోమలు విపరీతంగా పెరిపోయి ప్రజలకు ఇబ్బందిగా మారాయి. ఇక్కడ నీరు నిల్వ ఉండకుండా ఉండాలంటే రోడ్డును మెరక చేయవలసి ఉంటుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులు తీర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పాతనాగులూరులో మునిగిన రోడ్డు

అచ్యుతానందన్ సేవలు మరువలేనివి



మచిలీపట్నంలో మాట్లాడుతున్న వై.నరసింహారావు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : కేరళ మాజీ సీఎం విఎస్ అచ్యుతానందన్ వివిధ హోదాలలో పేద ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్ ధనుంజయరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం బుట్టాయిపేట మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో విఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు మాట్లాడుతూ దేశంలో పేదల కోసం పోరాడే పార్టీ ఏదైనా ఉంది అంటే అది సిపిఎం అని గర్వంగా చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలిచి కేరళ రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రిగా విఎస్ తన ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు. సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అంగత రమాదేవి, సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రమణ్యం, సిఐటియు నగర కన్వీనర్ చిరువోలు జయరావు, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎండి యూనస్, ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు టి చంద్రపాల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉంగుటూరు : కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం వ్యవస్థాపకులలో ఒకరైన విఎస్ అచ్యుతానందన్ అలుపెరుగని పోరాట యోధునిగా శిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతారని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు అన్నారు. బువారం మండలంలోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో సిపిఎం ఉంగుటూరు మండల కమిటీ ఆధ్వర్యంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా జరిగిన సభలో నరసింహారావు మాట్లాడుతూ గత ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా అచ్యుతానందన్ జీవితం కొనసాగిందని అన్నారు. అతి పేద కుటుంబంలో జన్మించి, కార్మికునిగా వ్యవసాయ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించి ఆ అనుభవాల ద్వారా పోరాట మార్గాన్ని ఎంచుకున్న అచ్యుతానందన్ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని తన జీవితాన్ని కొనసాగిం చారని అన్నారు. పోరాట నాయకుడిగా, ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా అన్ని రకాల బాధ్యతలను నీతి నిజాయితీతో నిర్వహించడంతో పాటుగా నిరాడంబర జీవితం గడిపారని వివరించారు. అందుకే నేటి తరం యువతకు ఆయన స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి లక్ష్మణస్వామి, పార్టీ మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, మండల నాయకులు మాగంటి సాంబశివరావు, పిల్లి రాజారావు, మహమ్మద్ గాలీభ్ తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో...

రేపటి నుంచి శ్రావణమాస మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవ స్థానంలో ఈనెల 25 నుండి వచ్చేనెల 23 వరకు శ్రావణ మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలి పారు. ప్రతిరోజు ఉదయం శ్రీ అమ్మవార్లకు దేవస్థానం ముఖ్య అర్చకులు శివ సంతోష్ శర్మ ,అసాదు టి.వేంకటేశ్వరరావుగారి ఆధ్వర్యంలో ఉదయం సహస్రనామ కుంకుమార్చనలు, ప్రతి శుక్రవారం ఉదయం పంచామత అభిషేకములు, సహస్రనామ కుంకుమార్చనలు సాయంత్రం పంచహారతులు నిర్వహిస్తారన్నారు. ఆగస్టు 15వ తేదీ శుక్రవారం ఉదయం 9గంటలకు మహిళలచే సాముహిక వరలక్ష్మి వ్రతాలు, అనతరం వ్రతము చేసుకున్న మహిళలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఇఓ తెలిపారు.



కొత్తమాజేరుకు రాకపోకల పునరుద్ధరణకు చర్యలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం కొత్తమాజేరు గ్రామానికి రాకపోకల పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. గుండేరు మేజర్ డ్రైనేజీలో ఎగువ నుంచి కొట్టుకు వస్తున్న ముంపు నీరు మళ్ళింపు, గుర్రపుడెక్క తొలగింపు చర్యల నేపథ్యంలో ఒరవడికి వంతెన అప్రోచ్ రోడ్డు కింద ఊళ పడి భారీ గండిపడింది. ఈ నేపథ్యంలో శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో ఆర్అండ్బీ అధికారుల పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం మెటీరియల్ తెచ్చి గండి పూడ్చనున్నారు. కొండ రాళ్ల తరహా మెటీరియల్ తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. మరోవైపు డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబూ నాయక్ ఆధ్వర్యంలో గుర్రపు డెక్క తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గండి వద్ద పరిస్థితిని మండలి వెంకట్రామ్ పరిశీలించారు. సాధ్యమైనంత వేగంగా గండి పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆర్అండ్బీ అధికారులకు మండలి బుద్ధప్రసాద్ సూచించినట్లు తెలిపారు. జనసేన గ్రామ అధ్యక్షులు బండి నాగార్జున, టీడీపీ నాయకులు బొర్రా అగ్గిరాముడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం లోని టవల్స్ కంపెనీ వద్ద రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యికి రిపేర్లు చేశారు. 'రోడ్డు మధ్యలో గొయ్యి' అనే కథనంతో ప్రజాశక్తిలో వార్త వచ్చిన విషయం తెలిసిందే. పంచాయతీ అధికారులు స్పందించి కాలువపై ఉన్న సిమెంట్ బిళ్ళలను పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మాణం చేయించారు. మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు, వాహనదా రులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



నవోదయలో ప్రవేశానికి 29లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన పేద విద్యార్థుల భవిష్యత్తును నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాలలో 6 తరగతిలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్ష ఈ ఏడాది డిసెంబర్ 13 న నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు ప్రకటనలో తెలిపారు. కాబట్టి అర్హత ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 29 వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ కృష్ణకుమారి

కిశోర బాలికా వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండల పరిధిలోని ఎస్ఆర్వైఎస్ పి కళాశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలికల కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులు ప్రస్తుత సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలికలకు సంపూర్ణ ఆహారం ఆరోగ్యం, నాణ్యమైన విద్య వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుండి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టుట, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్యం ఉపాధి, లింగ వివక్షత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ వై ఎస్ పి హెచ్ఎం సుదర్శన్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అండర్పాస్ వద్ద నీటి నిల్వతో ఇబ్బందులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలోని తాడింకి-విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద వర్షం నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తాడంకి గ్రామం వద్ద మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గోపువానిపాలెం, మంటాడ గ్రామాలను కలుపుతూ అండర్ పాస్ ఏర్పాటు చేశారు. అండర్ పాస్ ఎత్తు లేకపోవడంతో నీరు నిలిచి వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అండర్ పాస్ ద్వారా బస్సులు మచిలీపట్నం, విజయవాడ, లారీలు, ట్రాక్టర్లు ద్విచక్ర వాహనాలు, ప్రయాణికులు వెళ్ళవలసి ఉంది. అలాగే తాడంకి ఉన్నత పాఠశాలకు విద్యార్థులు వెళ్తుంటారు. అయితే వర్షం కురిసినప్పుడల్లా ఇదే ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జాతీయ రహదారిపై విద్యుత్ కాంతులు లేక ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



డ్రైనేజీల్లో గుర్రపుడెక్క తొలగించాలి



డ్రైనేజీల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ప్రజాశక్తి- మొవ్వ : మండలంలో ప్రధానంగా చినముత్తేవి, కాజ వంతెనల అయినంపూడి డ్రైనేజీలో గుర్రపు డెక్క తొలగించి నీరు పారుదల అయ్యే విధంగా చూడాలని ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. యుద్ధ ప్రతిపాదికన సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పూర్తిస్థాయిలో తొలగించి ముంపు బారిన ఉన్న వరి పొలాలను రక్షించాలని కోరారు. బుధవారం మండలంలో కాజ, చినముత్తేవి డ్రైనేజీల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్కను పరిశీలించారు.

సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో బుధవారం కోరమాండల్ కంపెనీ వారి సహకారంతో ఖరీఫ్ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన, చర్చా గోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సమన్వయకర్త డా సుధారాణి మాట్లాడుతూ పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని, సాగు ఖర్చు అధికంగా మారి నికర ఆదాయం తగ్గుతుందని, రసాయనేతర పద్ధతులు అవలంభించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని తెలిపారు. వరిలో చేపట్టాల్సిన ఎరువులు, కలుపు యాజమాన్యం పై సస్యపోషణ శాస్త్రవేత్త వెంకటలక్ష్మి వివరించారు. వరిలో ఆశించే చీడ పీడల యాజమాన్య పద్ధతులను, ఎలుకల యాజమాన్యంలో చేపట్టాల్సిన మెళకువలను సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి తెలిపారు.. కోరమాండల్ తరపున ట్రైల్స్ మేనేజర్ రామకష్ణ రైతులకు నానో యూరియా, నానో డిఏపీ పని తీరు వినియోగించే విధానం, డ్రోన్ పిచికారీ మొదలగు అంశాల పైన రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్తలు, కోరమాండల్ డివిజన్ మేనేజర్ మోహన్ కుమార్, కోరమాండల్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవన్ వద్ద బుధవారం గవిర్నేని లలితకుమారి(సజ్జా) వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల వితరణతో 75 మందికి నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని . నిర్వహించినట్లు అధ్యక్షులు మెరుగు పెరుమాళ్ళు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి కల్యాణపు నావాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, జంగం మోహనరావు, చాపరాల రాజేశ్వరావు, వైపీసీ ప్రసాద్, ఆడుసుమిల్లి వీరభద్రరావు , దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధికి శంకుస్థాపన


మొర్సుమిల్లిలో రహదారి పనులకు శంకుస్థాపన చేసిన ఎంఎల్ఎ వసంత

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం మండల పరిధిలోని మొర్సు మిల్లి నుంచి తండాకు వెళ్లే రహదారి అభివృద్ధి పనులకు స్థానిక ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణప్రసాదు బుధ వారం శంకు స్థాపన చేశారు. దీని నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.1.68 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 3.2 కిలోమీటర్ల పొడవునా రహదారిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా రోడ్డు గోతులమయంగా మారగా ప్రజలు, వాహన చోదకులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం మరుసుమల్లి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - మైలవరం : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని మైలవరం ఎంఎల్ఎ వసంత కృష్ణప్రసాదు లబ్ధిదారులకు చెక్కుల రూపంలో బుధవారం మైలవరంలోని తన కార్యాలయంలో అందజేశారు. మైలవరం మండలానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.5,62,577లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన చెక్కులను శాసనసభ్యులు కష్ణప్రసాదు అందజేశారు. చెక్కులతో పాటు సిఎం చంద్రబాబు సందేశ పత్రాలను కూడా ఎమ్మెల్యే అందజేశారు. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు.

25న బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల వక్ఫ్ బోర్డుకు చెందిన దర్గా హజరత్ దావుద్ షా ఆలీ రహ వాక్స్ బోర్డు భూమి సర్వే నెంబర్ 163/1లో య 9.30 భూమికి 2024 లీజు రూల్స్ ప్రకారం 3 సంవత్సరాల కాలానికి గానూ ఈ నెల 25 ఉదయం 11 గంటలకు జగ్గయ్యపేట పట్టణంలో తహశీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ మనోహర్ తెలిపారు. ఈ వేలంలో ఆసక్తి గలవారు ధరావత్ రూ.10 వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

చంద్రశేఖర్ ఆజాద్, తిలక్ జయంతి

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలను ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్సిసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె అప్పారావు మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్కులు పోరాట ప్రతిభ ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారని వారి అడుగుజాడల్లో నేటి యువత నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి రమేష్ రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివహరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహం మధ్య, ఎన్ఎస్పి కాలవ వద్ద రోడ్డు వర్షాల వలన గోతులమయంగా మారి గత నెల రోజుల నుంచి ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న విస్సన్నపేట లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు, ప్రముఖ కాంట్రాక్టర్ టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు వెంటనే స్పందించి ఆయన ఆర్థిక సౌజన్యంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు లయన్ లలితా రామకృష్ణ పర్యవేక్షించారు.

అచ్యుతానందన్‌కు పలువురు నివాళి

ప్రజాశక్తి - విజయవాడ : కేరళ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్‌కు మంగళవారం శ్రీశ్రీ భవన్లో సంతాప సభ నిర్వహించారు. సిపిఎంరాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అచ్చుతానందన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కాశీనాథ్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఆధునిక రాష్ట్రస్థాయికి అభివృద్ధి చేసిన నాయకుడు అచ్చుతానందన్ అని అన్నారు. కేరళ రాష్ట్రంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసి ప్రజల మనసులో చిర స్థాయికి నిలిచిపోయిన వ్యక్తి అచ్యుతానందన్ అన్నారు. ఈ సంతాప సభ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణ రావు, సెంట్రల్ సిటీ నాయకులు కె.దుర్గారావు, వై.సుబ్బారావు, బి.లక్ష్మణరావు, మదరా బి తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి సిపిఎం కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డివి కృష్ణ హాజరై మాట్లాడుతూ కుల వివక్షత అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ అచ్యుతానందన్ లేని లోటు, కార్మిక కర్షక కష్టజీవులకు తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, పట్టణ కమిటీ సభ్యులు ఎస్కె బాషా పాల్గొన్నారు. **విజయవాడ సిటీ :** కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టులకు తీరని లోటు అని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు పేర్కొన్నారు. సిపిఎం పశ్చిమ నగర శాఖ ఆధ్వర్యంలో కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ తో పాటు 42వ డివిజన్, 50వ డివిజన్, కొత్తపేట లోని శ్రామిక్ భవన్లో కేరళ మాజీ సీఎం విఎస్ అచ్యుతానందన్ సంతాప సభా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిపిఎం ఫ్లోర్ లీడర్ పార్టీ పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్య బాబు తోటి నేతలు, కార్యకర్తలతో కలిసి కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే సూరిబాబు, పి రాజు, ఎం కొండారెడ్డి. పి సూరిబాబు, ఏ శ్రీనివాస్, ప్రజాశక్తి రాష్ట్ర బాధ్యులు సభ్యులు వి.సురేష్, నగర కార్యదర్శి వి నారాయణ, ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీతారాములుపాల్గొన్నారు. **విస్సన్నపేట :** సిపిఎం కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కి స్థానిక సుందరయ్య భవనంలో స్థానిక మండల సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, మండల కమిటీ సభ్యులు వినుకొండ రంగారాని కరెడ్ల ధనలక్ష్మి గద్దల రామకష్ణ కోలేటి రమేష్, సభ్యులు లోకేశ్వరరావు గద్దల లాలయ్య, సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు తాపీ వర్కర్ యూనియన్ మండల ప్రెసిడెంట్ మరి బోయిన అప్పారావు పాల్గొన్నారు.



విజయవాడ శ్రీశ్రీ భవన్‌లో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాశీనాథ్


ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న డి.వి.కృష్ణ, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, తదితరులు


50వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న సత్యబాబు, తదితరులు

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట, ఆయుష్ శాఖ వారి సహకారంతో పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 620 మందికి విద్యార్థినులకు పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటలకు విద్యార్థినులకు యోగా శిక్షణ కార్యక్రమం డాక్టర్ వై.రత్న ప్రియదర్శిని పర్యవేక్షణలో అశ్విని, కృష్ణవేణి, యోగ మాస్టర్లచే యోగా చేయించారు. అనంతరం మెడికల్ క్యాంపును గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ సుజాత, జిల్లా ఆయుష్ష అధికారి డాక్టర్ వై.రత్న ప్రియదర్శిని మాట్లాడారు. 620 మంది విద్యార్థినులకు పరీక్షించగా 220 మందికి రకరకాల సమస్యలతో ఉన్నట్టు వారిని పరీక్షించిన డాక్టర్ ఎన్ కవిత, డాక్టర్ విష్ణువర్ధన్ లు పరీక్షించి 50 వేల విలువ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట కార్యదర్శి లయన్ ఖాసిం సైదా, లయన్ జి.నారాయణరెడ్డి, లయన్ కే. అమర్నాథ్, లయన్ ఎస్ వి వి సత్యనారాయణ, లయన్ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌ను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సంబంధిత సమస్యల పరిష్కారానికి స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య బుధవారం రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్‌ను మనీష్ కుమార్ సిన్హా ను మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా మంత్రిని కలిసి సమస్యలను వివరించిన రాజగోపాల్, ఈసారి ట్రాన్స్పోర్ట్ కమిషనర్‌కు వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం జగ్గయ్యపేట నుండి విజయవాడ నున్న వరకూ వెళ్లాల్సిన అవసరం వల్ల వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు వివరించారు. కమిషనర్ స్పందిస్తూ ఇది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టు అయినప్పటికీ సంబంధిత అధికారులతో చర్చించి త్వరలో జగ్గయ్యపేటలోనే ఫిట్నెస్ సర్టిఫికేట్ సెంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతవరకూ తాత్కాలికంగా ట్రాక్టర్లు మరియు ఆటోలు కోసం జగ్గయ్యపేటలోనే ఫిట్నెస్ సర్టిఫికేట్ ప్రక్రియ పూర్తి చేయడానికి అనుమతులు ఇస్తామని తెలిపారు.

కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండ, కొటికలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ కుమారీ ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలు రసాయన ఎరువుల పురుగుమందులు వినియోగం వల్ల దుష్ప్రభావాలు, దుష్ఫలితాలు గురించి రైతులకి సవివరంగా తెలిపారు. పిఎం ప్రణామ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం తెలిపి నానో యూరియా, నానో డిఎపి వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మౌనిష ఎఫ్ టి సి, స్థానిక తహశీల్దార్, స్థానిక సర్పంచ్ కేతనకొండ, ఉద్యానవన శాఖ అధికారి వేణుమాధవ్, ప్రకృతి వ్యవసాయం స్టాఫ్ హసీనా, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో...

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలోని అనే రావు పేట మరియు రెడ్డిగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు భూసారాన్ని పెంచే క్రమంలో వారి గట్ల పైన ఖాళీ స్థలాల్లో గ్లేరిసిరీయా మొక్కలు పెంచాలని, అంతర పంటలైన మినుము, పెసర, కంది, నువ్వులు జొన్నలు వాటి దిగుబడిని తీసుకొని వాటి చొప్పను సాళ్లలో వేసినందున భూసారం వృద్ధి చెందుతుందని తెలిపారు. కిసాన్ డ్రోన్స్ ఉపయోగించి సస్య రక్షణ మందులను పిచికారి చేయడం వల్ల తక్కువ ఖర్చు, కూలీలు సమస్య అధిగమించవచ్చని రైతులందరూ కౌలు కార్డులు పొందాలని పంట ఇన్సూరెన్స్‌ను ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జె.సుశీల దేవి ఎంపిడిఒ టివి కె.రమణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా డి తులసి విఎఎ విహెచ్ఏలు రైతులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

వికలాంగ పాఠశాలకు కుర్చీలు, శానిటరీ వస్తువులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శ్రీ వాసవి సేవా సమితి జగ్గయ్యపేట వారి అధ్వర్యంలో అత్తులూరి వెంకట అప్పారావు దశమతిథి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వారి భార్య చంద్రకళ, కుమారుడు విశ్వనాథ్ సౌజన్యంతో పట్టణంలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో 5 కుర్చీలు మరియు శానిటరీ సామాన్లు కుమారుడు విశ్వనాథ్ కోడలు కావ్యమనవడు నిహాస్ అల్లుడు పేరూరి సత్యనారాయణ కుమార్తె పావని చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిథిగా బియ్యం కిరాణా వర్తకసంఘం జగ్గయ్యపేట అధ్యక్షులు వాసవి సేవా సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు పేరూరు నరసింహారావు, జిల్లా సెక్రటరీ పెనుగొండ రామకష్ణ, జిల్లా మహిళా విభాగం ట్రజరర్ వూటుకూరి అలేఖ్య, ఉపాధ్యాయురాలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.


వెంకటేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని హెచ్ ముత్యాలపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చల్ల వెంకటేశ్వరరావు (96) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.


విరాళం

ప్రజాశక్తి - గంపలగూడెం : ఊటుకూరు శ్రీ కోదండ రామస్వామికి లక్ష విరాళం వచ్చింది. స్థానికంగా ఉన్న రాజస్థాన్ స్వీట్ షాప్ యజమాని దివంగత రాజ పురోహిత్ కిషోర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు బుధవారం రూ.లక్ష ఆలయ కమిటీకి అందజేశారు.

సుపరిపాలనపై టిడిపి విస్తృత ప్రచారం



బందరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు



కంకిపాడు మండలంలో తాడిగడపలో కరపత్రాలు అందిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్



అవనిగడ్డలో...


ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలోని 35, 37వ డివిజన్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు ఆయన తెలుసు కున్నారు. రోడ్లు, తాగునీరు, మురుగు సమస్యల గురించి ఆరా తీశారు. వర్షాకాలం కావడంతో ఎక్కడా మురుగు నిలవడానికి వీల్లేదని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో తాగునీరు కూడా సక్రమంగా అందాలని సూచించారు. ప్రభుత్వ స్కూల్‌ను పరిశీలించి సదుపాయాల గురించి ఆరా తీశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమై సంక్షేమ పథకాల లబ్దిదారుల గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగుతోంద న్నారు. పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఆయా డివిజన్ ఇంచార్జ్ లు ,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గన్నవరం నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలోని ఏలూరు కాలువ కట్ట, మద్యకట్ట, గోపాల్ కట్ట ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో యార్లగడ్డ పాల్గొని గత ఏడాది కాలం గా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామ సర్పంచ్ సర్నాల గంగా రంత్నం బాలాజీ, ఉపసర్పంచ్ గుడవల్లి నరసయ్య, బొప్పన హరికష్ణ, గుజ్జర్లపూడి బాబురావు, పరుచూరి నరేష్, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** తాడిగడప మున్సిపాలిటీ తాడిగడప ఇంజనీరింగ్ కాలేజి వంతెన ఎదురు శ్రీనివాసనగర్ కట్ట వద్ద సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ నిర్వమించారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, టీడీపీ కష్ణా జిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబు, కూటమి నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** కూటమి ప్రభుత్వంలో ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకులు రావిరత్నగిరి అన్నారు. బుధవారం మోపిదేవి మండల పరిధిలోని కొక్కిలిగడ్డ కొత్తపాలెం గ్రామంలోమండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు చందన రంగారావు నేతత్వంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జి కొలుసు శివ రాజేష్, పడమటి వెంకటేశ్వరరావు బల్ల సీతారామ ప్రసాద్ ,ఉప్పల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ రెండవ వార్డ్ లోని ఎస్టీ కాలనీలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలపై ప్రచురించిన సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్ర సుధాకర్ బం డే రాఘవ, పర్చూరు దుర్గాప్రసాద్, మండలి రామ్మోహ న్‌రావు, బచ్చు హనుమాన్, బండి కనకదుర్గ పాల్గొన్నారు.**ప్రజాశక్తి - గుడివాడ :** సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల నిర్వహణలో గుడివాడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలబెడదామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక టిడిపి కార్యాలయంలో పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాల పురోగతిపై బూత్ ఇన్చార్జిలు, క్లస్టర్లు యూనిట్ ఇన్చార్జులు, కె.ఎస్.ఎస్‌లతో వార్డుల వారీగా ఎమ్మెల్యే రాము సమీక్షించారు. పార్టీ శ్రేణుల పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తూ, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు పంద్రాజు సాంబయ్య, చేకూరు జగన్మోహన్రావు, లింగం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు స్టేషన్లో ఎంఎల్ఎ హల్‌చల్

- ఎస్ఐపై తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి - తిరువూరు : ఇద్దరు టిడిపి కార్యకర్తల మధ్య సోమవారం రాత్రి జరిగిన ఘర్షణపై నమోదైన కేసు విషయమై మంగళవారం రాత్రి తిరువూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు అక్కడ హంగామా సృష్టించారు. పోలీసులను ప్రశ్నలతో హడలెత్తించారు. టిడిపి కార్యకర్త చిల్లపల్లి రామకృష్ణ అదే పార్టీకి చెందిన సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై తెలుగుదేశం పార్టీకే చెందిన మరో కార్యకర్త కందిమళ్ల సాయి సుమిత్ ప్రతి స్పందించాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్యా మాటల యుద్ధం సాగింది. ఈ నేపథ్యంలో సాయి సుమిత్‌పై రామకృష్ణ దాడిచేసి తలపై గాయపరిచాడు. సాయి సుమిత్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రామకృష్ణ కోసం ఇంటికి వెళ్లిన ఎస్ఐ అతడు లేకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో ఆయన తల్లిని, సోదరిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ కొలికపూడి మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో స్టేషన్‌కు వెళ్లారు. రామకృష్ణ తల్లిని, సోదరిని స్టేషన్లోనే ఉంచడంపై ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి 9 గంటలైన తర్వాత మహిళలను స్టేషన్లో ఉంచకూడదు కదాని పోలీసులను ప్రశ్నించారు. ఆ సమయంలో ఎస్ఐ సత్యనారాయణ ఓ కేసు విషయంలో నిందితుడి కోసం వేరే ప్రాంతానికి వెళ్లారు. ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో సిఐ గిరిబాబు స్టేషన్‌కు వచ్చారు. రామకృష్ణ ఇంటికి సాయి సుమిత్, ఆయన తరపు వారు వచ్చి దాడి చేస్తుంటే ఆత్మరక్షణ కోసం రామకృష్ణ దాడి చేశాడని, ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టడం ఏమిటని సిఐను నిలదీశారు. రామకృష్ణ ఇంటికెళ్లి గొడవ చేసిన వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ఎంఎల్ఎ ప్రశ్నించారు. రామకృష్ణ ఫిర్యాదు చేయలేదని, గాయాలైన సాయి సుమిత్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సిఐ చెప్పినా ఎంఎల్ఎ... అదంతా అనవసరం, వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన తర్వాతే రామకృష్ణను తానే తీసుకొస్తానని తేల్చిచెప్పారు. అంతేగాక ఎస్ఐపై తీవ్ర ఆరోపణలు చేశారు. గంజాయి అమ్మకాలకు ఎస్ఐ కొమ్ము కాస్తున్నారని, గంజాయి విక్రయించాలని తమ కుమారుడిని ప్రోత్సహిస్తూనే అక్రమ కేసులు బనాయించినట్లు ఓ బాధిత తండ్రి తనకు చెప్పాడని ఎంఎల్ఎ అన్నారు. గంజాయి రవాణా చేయించి డబ్బులు పోగేసుకుంటున్నారని, డబ్బులు ఇవ్వని వారిని వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో ఇలానే చేశారన్నారు. ఎస్ఐ విషయం తనకు అంతా తెలుసునని అన్నారు. అయితే పరస్పరం ఘర్షణకు దిగిన ఆ ఇద్దరు టిడిపి కార్యకర్తల్లో ఒకరు విజయవాడ ఎంపి గ్రూపుగానీ, మరొకరు ఎంఎల్ఎ గ్రూపుగానూ ఉన్నట్లు తెలిసింది.

సాత్విక్‌కు ఎంఎల్ఎ అభినందనలు



సాత్విక్‌ను అభినందిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చల్లపల్లి/అవనిగడ్డ : పీ-4 భాగ స్వామి మురారి సాత్విక్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సత్కారించారు. చల్లపల్లికి చెందిన రైతు మురారి శంకర్-లక్ష్మి దంపతుల కుమారుడు సాత్విక్ 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన విదేశీ విద్యా పథకం ద్వారా 2016లో ఐర్లాండ్ దేశం వెళ్లి ఎంఎస్ బిజినెస్ మేనేజ్మెంట్ చదువుకున్నాడు. అక్కడే కొంతకాలం ఉద్యోగం చేసి ఇప్పుడు ఐర్లాండ్ లోనే వ్యాపారం ప్రారంభించాడు. తాజాగా కూటమి ప్రభుత్వం పీ-4 ప్రోగ్రామ్ ప్రవేశపెట్టిన విషయం తెలుసుకుని, తనలాగే మరో నలుగురు పేద విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశం కల్పించి స్కాలర్ షిప్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాడు. సాత్విక్ తన నిర్ణయాన్ని సీఎం చంద్రబాబును కలిసి వివరించి సీఎం ప్రశంసలు అందుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం అవనిగడ్డలో శాసనసభ్యులు బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్‌లను సాత్విక్ బుధవారం కలవగా వారు అభినందించారు. కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పీ-4 కార్యక్రమానికి దేశ, విదేశాల్లో స్థిరపడిన తెలుగు వారి నుంచి స్వచ్ఛందంగా అపూర్వ స్పందన రావటం శుభ పరిణామం ఎంఎల్ఎ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ బిగిస్తే ప్రతిఘటించాలి



విజయవాడ : స్మార్ట్ మీటర్లు బిగిం చేందుకు వచ్చిన వారిని అడ్డగించి ప్రతి ఘటించాలని సిపియం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో గత వారం రోజుల నుండి గవర్నర్ పేట సూర్యరావు పేట, సీతారాంపురం ప్రాంతా లలో ప్రతి ఇంటికి వెళ్లి స్మార్ట్ మీటర్లులకు వ్యతి రేకంగా ప్రజల్లో అవగాహన తీసుకొస్తూ వారితో వ్యక్తిగత అప్లికేషన్లు పెట్టిస్తున్నామని అన్నారు. గవర్నర్ పేట విద్యుత్ కార్యాలయంలో ఎఇకి అప్లికేషన్లు, వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. సిపియం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు వై. సుబ్బారావు, సిపిఎం స్థానిక నాయ కులు కె.గురుమూర్తి, బి.లక్ష్మణరావు, కె.వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కోడూరు : కోడూరు మండల పరిధి లోని ద్వారకా దగ్గర నుండి వేటపాలెం వరకు వెళ్లే గోపన్న డ్రైనేజీ పూడికతీత పనులను అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ కృషితో పనులను చేపట్టారు. బుధవారం ద్వారక వద్ద గల గోపన్న డ్రైనేజీ పూడికతీత పనులను తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'శాతవాహన' ప్రిన్సిపాల్‌పై చర్యలకు డిమాండ్



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ నేతృత్వంలో అనేక ఒడిదుడుకుల్ని అధిగమించి కబ్జా కోరల నుండి కాపాడాలి స్థానిక చుట్టగుంట సమీపంలో ఉన్న కళాశాలకు మూసిఉన్న గేట్లను తెరిపించి ప్రారంభించి, అధ్యాపకులు నూతన డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తూ, డిగ్రీ ద్వితీయ ఏడాది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూన్నారు. కానీ కళాశాలను నిర్వహించ వలసిన ప్రిన్సిపాల్ అందుబాటులో లేకుండా పోయారని పరిరక్షణ కమిటి అధ్యక్షులు వి శ్రీనివాసరావు ప్రచార కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్ తెలిపారు. బుధవారం విద్యార్థులతో కలిసి కళాశాల వద్ద ఆందోళన చేశారు. దరఖాస్తులు ఆన్ లైన్, ఆఫ్ లైన్ చేయాలంటే కంప్యూటర్ల అవసరం ఉందని, ఈ రెండు నెలల కాలంలో కాలేజిలో ఉండే కంప్యూటరు లు సీలింగ్ ఫ్యాన్లు, ఏసి లు , బల్లలు ఇతర విలువైన వాటిని మాయం చేశారని పేర్కొన్నారు. ఈ తరుణంలో పరిరక్షణ కమిటీ దృష్టికి అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని వారు తెలిపారు. కళాశాల ఏర్పాటులో సొసైటీలో ఒకరైన ప్రజాపతిరావు వృద్ధాప్యంలో ఉండగా ఆయనను తప్పుదోవ పట్టిస్తూ ఉన్నారు. రెండు వర్గాల మధ్య విభేదాలు ఆసరాగా చేసుకుని వాళ్ళలో వాళ్ళకే మధ్యలో గొడవలకు మరింత ఆజ్యం పోసిన సంఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిర్వహణలోనే కొత్త వ్యక్తిని ప్రిన్సిపాల్‌గా నియమించాలని వారు కోరారు. కళాశాల భవనాల కూల్చివేతకు కారణమైన బోయపాటి శ్రీనివాస అప్పారావు కాగా ఆ నెపాన్ని సొసైటీ కార్యదర్శి, ఎమ్మెల్సీ గా ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌పై నెట్టి తప్పుడు ప్రచారానికి కారకులైన కళాశాల ప్రిన్సిపాల్, కరస్పా ఒడెంట్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రహదారి జలమయం

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని పెనుగంచిప్రోలు నుండి అనిగలపాడు వెళ్లి రహదారి వాగు దగ్గర వాహనాలు పూర్తిగా స్తంభించిపోయాయి. వాగుదగ్గర బ్రిడ్జిపై నీళ్ల ప్రవాహం పొర్లిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనదారులు భయపడుతూ బిక్కుబిక్కుమంటూ బ్రిడ్జి మీదే నడుచు కుంటూ దాటుతున్నారు. ఆటోలు సైతం నిలిచి పోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీటితో జలమయమయ్యాయి. మండలంలోని పెనుగం చిప్రోలు, వత్సవాయి మండలాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు నిండి పొర్లు ప్రవహించాయి. గ్రామాల్లో అంతర్గత రహదారులు నీటిమట్టంతో మునిగిపోయాయి. వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి లోతట్టు ప్రాంతాల్లో పత్తి పంటలు మునిగిపోయాయి.

ఆషాఢ మాసోత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : మెయిన్‌రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆషాడమా సోత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ శాకంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీ విజయ దుర్గ కోలాట భజన సమాజం ఆధ్వర్యంలో సారే సమర్పించారు. దేవస్థాన చైర్మన్ జవ్వాజి గంగరాజు పాల్గొన్నారు.

సీనియర్ ఉమెన్ చదరంగం పోటీలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : సక్సెస్ - ది విజయవాడ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న నగరంలోని పాపులర్ స్పోర్ట్స్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు సీనియర్ ఉమెన్ అఫీషియల్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ సెక్రటరీ మందుల రాజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఐదు సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు లోపు బాలికలు, ఉమెన్స్ మాత్రమే ఈ పోటీలు అర్హులని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు ఈనెల 26, 27 తేదీల్లో విజయవాడలోనే జరిగే రాష్ట్ర స్థాయి ఉమెన్ చదరంగ పోటీలకు మన జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎమ్‌డి అక్బర్ పాషా, మందుల రాజీవ్ తెలిపారు. వివరాలకు 90303 08811 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు

నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - గంపలగూడెం : కట్టలేరు వంతెనతో కష్టాలు మళ్లీ మొదలైనాయి. ప్రతి ఏట వర్షాకాలం వస్తే చాలు... కట్టలేరుపై ఉన్న వంతెన కుప్పకూలడంతో మళ్లింపు రహదారితో వర్షం పడిన ప్రతిసారి ప్రజలకు ప్రయాణం సంకటనగా మారుతుంది. వంతెన ఈ ఏడాది పూర్తవుతుంది, వచ్చే ఏడాది పూర్తవుతుందన్న ప్రజల ఆశలు ఆశలుగానే మిగిలాయి. విద్యార్థులు, వ్యవసాయదారులు, కూలీలతో పాటు అన్ని రకాల ప్రజలు అవస్థలు పడుతున్న పరిస్థితి. సోమ, మంగళ వారాల్లో పడిన వర్షం కారణంగా రహదారిపై వరద పొంగుతోంది. దీనితో గంపలగూడెం రక్షణ శాఖకు పని పడింది. వంతెనకు రెండువైపులా స్టాప్ బోర్డులు పెట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, హెచ్చరిస్తూ, పోలీసులు అక్కడే ఉండి రాకపోకలు జరపుకుండా పర్యవేక్షిస్తున్నారు.

మంచి నీటి అక్రమ కనెక్షన్లు తొలగించాలి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం కమ్మవారి పాలెం గ్రామంలో మంచినీటి కొరత తీవ్రంగా వుందని గ్రామానికి చెందిన శ్రీ రామనేని రమణ పేర్కొన్నారు. గ్రామంలో అక్రమ మంచి నీటి కనెక్షన్లు తొలగించాలని డిమాండ్ చేశారు. మునేరు ఉదతంగా ప్రవహిస్తున్న మంచి నీరు సకాలంలో రావటం లేదు.

తాగునీటికి ఇక్కట్లు

ప్రజాశక్తి - నందిగామ : గత 20 రోజుల నుంచి నందిగామ 18,17 వార్డులలో మంచినీటి పంపులు రావడం లేదు. పసిపిల్లల తల్లులు, వృద్ధులు మంచినీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఒక పక్కన వాన బయటికి రాలేని పరిస్థితి ఏం చేయాలో ఎలా తెచ్చుకోవాలో తెలియని పరిస్థితిలో నందిగామ కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మమ్మల్ని పట్టించుకునే నాధుడు ఎవరూ లేరా అంటూ కాలనీ వాసులు దాహంతో అల్లాడుతున్నారు. మంచినీటికి ఎండాకాలంలో కూడా ఇంత కొరత ఎప్పుడు రాలేదంటూ కాలనీ ప్రజలు వాపోతున్నారు. నందిగామ మున్సిపల్ కమిషనర్ మా మొర ఆలకించండి మహాప్రభు అంటూ కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులకు త్రిబుల్ ఐటీలో సీట్ వచ్చి చదువుకోవడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం ఆర్థిక సహాయం చేశారు. ఆ విద్యార్థులను తన కార్యాలయానికి ఆహ్వానించి ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున అందజే శారు. ప్రతి సంవత్సరం సహాయం చేస్తానని విద్యార్థులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



విద్యార్థులకు సాయం అందజేస్తున్న ఎంఎల్ఎ కొలికపూడి

ఛాతి నొప్పి నిర్లక్ష్యం చేయొద్దు

డాక్టర్ ఎన్‌టిఆర్ వర్సిటీ విసి చంద్ర శేఖర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : గుండెపోటు వచ్చినప్పుడు చాలా మంది ఆకస్మికంగా మృతిచెందుతున్నారని, గుండెపోటు వచ్చిన మొదటి గంట నుంచి నుంచి నాలుగు గంటల వరకు ఎంతో ప్రమాదకరమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, కార్డియాలజిస్ట్, సెంట్రల్ సిఎస్ఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. చాతి నొప్పి వచ్చిన వెంటనే అరగంటలో ఆసుపత్రికి వచ్చి, థ్రంబోలైటిథెరపీ చేయించుకుంటే బతికే అవకాశం ఉంటుందన్నారు. స్టేమి ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌ను రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గత ఏడాది నుంచి నిర్వహిస్తోందని చెప్పారు. 50 వేల విలువగల ఇంజక్షన్లు ఉచితంగా సరఫరా చేస్తోందని, ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. ప్రజలు చాతి నొప్పి వస్తే గ్యాస్ అని నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చాప్టర్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 18 నుంచి 20 వరకు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, కార్డియాలజిస్ట్, సెంట్రల్ సిఎస్ఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్ డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



థ్రంబోలైటిథెరపీ అంటే క్లాట్ బ్లస్టర్స్ అని, రక్తనాళాల్లో బ్లడ్ క్లాట్స్‌ను కరిగించి రక్తప్రసరణ సరిగా జరిగేల చేస్తుందని చెప్పారు. ఆయుష్ ఆసుపత్రి డైరెక్టర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ ఈనెల 18 నుండి 20వ తేదీ వరకు ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో జరిగిన కాన్ఫరెన్స్ లో 400 మంది కార్డియాలజిస్టు పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 68 శాస్త్రీయ సెషన్ల ద్వారా 62 మంది ప్రఖ్యాత ప్రతినిధులు, అమెరికా మరియు ఇతర దేశాల నుండి వచ్చిన 9 మంది అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఈ కాన్సరెన్స్ కార్డియాలజీ, క్లినికల్ ప్రాక్టీస్ మరియు గుండె సంబంధిత వైద్య రంగంలో జరుగుతున్న తాజా అభివద్ధుల మార్పిడికి ఒక ఉత్తమ వేదికగా నిలిచిందన్నారు.

కార్మికుల సామాజిక భద్రత లక్ష్యంగా బీమా కవరేజీ విస్తరణ

ఇఎస్ఐసి ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కార్మికుల సామాజిక ఆరోగ్య భద్రత లక్ష్యంగా నూతన స్ప్రీ ఆరోగ్య బీమా పథకంతో కార్మికుల జీవితాలకు ధీమా కల్పిస్తున్నామని.. ఈ పథకాన్ని కర్మాగారాలు, సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు కోరారు. బుధవారం విజయవాడ, గుణదలలోని సంస్థ కార్యాలయంలో యజమానులు, ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ పథకం (ఎస్‌పీఆర్ఈఈ-2025) ప్రచార సామగ్రిని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు.. అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక రాజ్య బీమా సంస్థ 196వ సమావేశంలో స్ప్రీ పథకానికి ఆమోదం లభించిందని, ఈ పథకాన్ని ఉపయోగించుకుంటూ కర్మాగారాలు, సంస్థలు స్వచ్ఛందంగా నమోదుకు ముందుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా యజమాని ప్రకటించిన తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చెల్లుబాటయ్యేదిగా పరిగణించడం జరుగుతుందని, రిజిస్ట్రేషన్ ముందుకాలానికి ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేదా ప్రయోజనం వర్తించదని అన్నారు. ఇప్పటివరకు నమోదుకాని కర్మాగారాలు,



పథకానికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంస్థలు తమ కార్మికులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఈ పథకం వీలుకల్పిస్తోందని, త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 69,632 కర్మాగారాలు, సంస్థలు నమోదయ్యాయని, దాదాపు 14 లక్షల మంది ఉద్యోగులు ఈ పథకం కింద ఉన్నారని ఎం.రామారావు వివరించారు. కార్యక్రమంలో ఐఎంఎస్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, స్టేట్ మెడికల్ ఆఫీసర్ డా.ఆర్.ప్రదీప్ కుమార్, కర్మాగారాల డైరెక్టర్ డి.చంద్రశేఖరవర్మ, బాయిలర్స్ డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావు, ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ నవనీత్ పాల్గొన్నారు.

విప్రో డిష్‌వాష్ జెల్ 'జిప్ఫీ' నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్‌కు చెందిన డిష్‌వాష్ జెల్ బ్రాండ్ నూతన ఉత్పత్తుల స్వీకరించినట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న రాయ్ తెలిపారు. నగరంలోని ఓ హెూటల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ'జిఫ్ఫీ కోసం దక్షిణాది స్టార్ నటులు సత్యరాజ్, రమ్యకష్ణన్‌లతో వాణిజ్య ప్రకటనను రూపొందించారు. అని అన్నారు. ఇది భారతీయ వంటగదుల్లో తరచూ ఎదురయ్యే జిడ్డుతో కూడిన నూనె మరకలను ఎదుర్కొనే జిఫ్ఫీ శక్తివంతమైన శుభ్రత సామర్థ్యాన్ని చూపిస్తుంది అన్నారు.. ప్రతి వంటింట్లో ఎదురయ్యే జిడ్డు సమస్యకు వినోదభరితమైన పరిష్కారంగా తెరకెక్కించిన ఈ కథనం సత్యరాజ్‌ను ఓ శాంత స్వభావం గల చెఫ్‌గా చూపించి, వెంటనే గట్టిగా పోరాడే యోధుడిగా మలుస్తుందిఅన్నారు, ఈ ప్రచారం ద్వారా తమ ఉత్పత్తి అసలైన విలువను వినోదాత్మకంగా చూపిస్తూనే, ప్రామాణికంగా చెప్పాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

టివిల కోసం శామ్‌సంగ్ నూతన ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సామ్‌సంగ్ యాడ్స్, కాంతార్‌తో కలిసి, బియాండ్ అవేర్‌నెస్ అనే నూతన ప్రచార కార్యక్రమం నువిడుదల చేసింది అని శాంసంగ్ రీజినల్ ప్రతినిధి ఎస్. రాజేష్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు.. ఇది కీలకమైన బ్రాండ్ కేపీఐలను నడిపించడంలో కనెక్టెడ్ టీవీ ప్రకటనల పర్యావరణ వ్యవస్థ పాత్రను స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుంది అన్నారు.. వివిధ పరిశ్రమలు, జనాభాల్లో సామ్‌సంగ్ స్మార్ట్ టీవీలపై క్యాంపెయిన్లకు సంబంధించి కాంతార్ నిర్వహించిన 100 కంటే ఎక్కువ బ్రాండ్ లిఫ్ట్ అధ్యయనాలను అధ్యయనం విశ్లేషించింది. అని తెలిపారు .ఇది నిజమైన వినియోగదారు ప్రవర్తనను ప్రభావితం చేయడంలో కనెక్టెడ్ టీవీల శక్తి స్పష్టమైన చిత్రాన్ని అందిస్తుందన్నారు.

గుంతలమయంగా రహదారులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో ప్రదాన రహదారులు గుంతలు పూడ్చటంలో నాయకులు, అధికారులకు 'చిత్తశుద్ధి' ఎక్కడ కనిపించటం లేదు. ముఖ్యంగా నందిగామ గాంధీ సెంటర్ నుండి రామన్నపేట వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై వాహనాలు రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాత జిల్లా కోర్టు వద్ద చిన్నపాటి వర్షాలకే రామన్నపేట రహదారి పూర్తిగా జలమయమై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు వెళ్లే క్రమంలో పాదచారులపై మురుగునీరు చిందిపడుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. పాత బైపాస్ రోడ్డు, గ్యాస్ కంపెనీ సమీపంలో రామన్నపేట రహదారి పూర్తిగా ధ్వంసమై పూర్తిగా గుంటలు పడి ఆటోలు, బస్సులు, స్కూలు బస్సులు, ద్విచక్ర వాహనాలు రోడ్డు దాటడానికి అనేక ఇక్కట్లు పడుతున్నారు. ప్రధాన రహదారులు గుంతలు పూడ్చటంలో ముందున్నామని పాలకులు చేస్తున్న వాగ్దానాల్లో స్పష్టత కనిపించటం లేదు. నందిగామ మున్సిపాలిటీ పరిధిలో వున్న రహదారులు గుంతలు పూడ్చటంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు రావడం లేదు. నందిగామ మున్సిపాల్టీకి కోట్లాది రూపాయల ఆదాయం సుమారు పది కోట్లు పైబడి ప్రజలు నుండి వస్తున్న మౌలిక సదుపాయాలు కల్పించటంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెలగని సెంటర్ లైటింగ్

నందిగామ గాంధీ సెంటర్

నుండి రామన్నపేట రహదారి పై వున్న సెంటర్ లైటింగ్ ఏడాది కాలం నుండి వెలగటం లేదు. సెంటర్ లైటింగ్ వెలిగించడంలో పాలకులు చేయలేకపోతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సెంటర్ లైటింగ్ వెలిగించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ చీకటిలో కుక్కలు దాడి చేసి ప్రజలను తీవ్రంగా గాయపడిన సందర్భాలున్నాయి. సెంటర్ లైటింగ్ పూర్తిగా వెలిగించడం పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నందిగామలో ఎక్కడ వెలగని వీధి లైట్లు

నందిగామ పట్టణంలో గత వారం పది రోజుల నుండి వీధి లైట్లు ఎక్కడ వెలగటం లేదు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గత వారం పది రోజుల నుండి చేస్తున్న సమ్మెను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో నందిగామలో వీధి లైట్లు ఎక్కడ వెలగటం లేదు. రాత్రివేళ నందిగామ పట్టణం పూర్తిగా అంధకారంగా మారింది. వీధి లైట్లు పూర్తిగా వెలిగించడంలో పాలకులు, అధికారులు చేయలేకపోతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తాగునీటి సమస్య తీవ్రం

నందిగామలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వారం రోజుల నుండి మంచి నీరు రాకపోవటం వల్ల దాహార్తితో ప్రజలు అలమటిస్తున్నారు. ట్యాంకుల ద్వారా మొక్కుబడిగా మంచి నీరు ఇస్తున్నారు. తక్షణమే మంచి నీరు సమద్ధిగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

